## క్లుప్తంగా

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**నందిగామ:** మండలంలోని ఐతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మూఢనమ్మకాల నిర్మూలనకు సంబంధించి విద్యార్థులు ప్రదర్శించిన లఘునాటిక ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసింది. సమాజాన్ని చైతన్య పరిచే విధంగా ఆలపించిన గీతాలు, నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వార్డుల్లో కమిషనర్ పర్యటన



**నందిగామ:** పట్టణంలోని సమస్యలు, మున్సిపాలిటీ అందిస్తున్న సేవలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు రోజూ వార్డుల్లో పర్యటిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 20వవార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డు ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. వార్డులో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### 159 మద్యం సీసాలు స్వాధీనం




**నందిగామ(చందర్లపాడు):** అక్రమంగా మద్యం రవాణా చేసినా, విక్రయాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ రూరల్ సీఐ ఐ.వి.నాగేంద్రకుమార్ హెచ్చరించారు. చందర్లపాడులో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా నిల్వ ఉంచిన 159 తెలంగాణ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో చందర్లపాడులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

### పది ట్యాంకర్లతో నీటి సరఫరా



**జగ్గయ్యపేట అర్బన్:** జగ్గయ్యపేటలోని హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద ప్రధాన పైపులైన్ లీకేజీకి గురికావడంతో మరమ్మతులు పనులు చేపట్టారు. దీంతో పట్టణ ప్రజలకు నీటికి ఇబ్బంది లేకుండా పది ట్యాంకర్ల ద్వారా ముమ్మరంగా నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులైన్ మరమ్మతుల కారణంగా రెండు రోజులపాటు నీటిసరఫరాకు ఆటంకం ఏర్పడినందున ఇబ్బంది లేకుండా అన్నివార్డుల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని మున్సిపల్‌చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. ట్యాంకర్ల ద్వారా చేపట్టిన నీటిసరఫరా పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పర్యవేక్షిస్తున్నారు. మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేసి, నీటిసరఫరాను పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు సాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు.

### ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వినతి



**నందిగామ:** నందిగామ పట్టణంలో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయ ఏవో రాజకిషోర్‌కు శుక్రవారం పలువురు న్యాయవాదులు వినతిపత్రం అందజేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో విశ్రాంత అధ్యాపకుడు, న్యాయవాది సూర్యదేవర సుబ్బారావు మృతి చెందడానికిగల కారణాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఏవోకు వినతి ప్రతం అందజేసినవారిలో న్యాయవాదులు ఎక్కిరాల హనుమంతరావు, కొమ్మినేని మాలేశ్వరరావు, రవికుమార్, మంగయ్య, చరణ్, తారాసింగ్ తదితరులు ఉన్నారు.

# సామాజిక సాధికార యాత్రకు తరలిరండి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



సాధికార యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉదయభాను, నాయకులు

**ప్రభుత్వ విప్ ఉదయభాను**

**జగ్గయ్యపేట అర్బన్:** ఈ నెల 24వ తేదీన జగ్గయ్యపేటలో జరగనున్న సామాజిక సాధికార యాత్రకు నియోజకవర్గ ప్రజలంతా భారీగా తరలి రావాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాల ఆవరణలో జగ్గయ్యపేట పట్టణం, మండలంలోని పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీనాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ఉదయభాను సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన సామాజిక విప్లవం, సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికార యాత్రను చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నివర్గాల ప్రజలకు ఆయా పథకాల ద్వారా అందిన లబ్ధి, రాజకీయ పదవులు, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో కల్పించిన సామాజిక న్యాయాన్ని వివరించేందుకు ఈ బస్సు యాత్ర చేపట్టామని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలంతా ఈ యాత్రకు తరలిరావాలని కోరారు.

**అభివృద్ధి విషయంలో రాజీపడను..**

జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎటువంటి ప్రలోభాలు, ఒత్తిడులు, సిఫార్సులకు లొంగిపోయి రాజీపడే ప్రసక్తే లేదని ఉదయభాను స్పష్టంచేశారు. గతంలో పేట పట్టణంలో రోడ్ల విస్తరణ కోసం షాపులను కూల్చివేస్తే వ్యాపారులంతా వ్యతిరేకమవుతారని తెలిసి కూడా అభివృద్ధికే కట్టుబడి విశాలమైన రోడ్లు నిర్మించానని గుర్తుచేశారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో తాను ఓటమి పాలైనా, పదవీకాలంలో ప్రజలకు మెరుగైన మౌలికవసతులు కల్పించేందుకే కృషిచేశానని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతోపాటు జిల్లా, రాష్ట్రస్థాయిలో తనకున్న పరిచయాలతో నిధులను సమీకరించి జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పేటలో రూ.75 లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపట్టామన్నారు. ఇనాం భూముల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కామవుతుందన్నారు. రూ.5కోట్లతో ఊరచెరువు అభివృద్ధి, రూ.14కోట్లతో చిల్లకల్లు-జగ్గయ్యపేట రోడ్డు పనులు చేపట్టామన్నారు. పేటకు ప్యాసింజరు రైలు కోసం ఢిల్లీకి సైతం వెళ్లి ప్రయత్నాలు చేశానన్నారు. ప్రస్తుతం జరుగుతున్న డబ్లింగ్ పనులు పూర్తయితే ప్రజల చిరకాల వాంఛ అయిన పేటకు ప్యాసింజర్ రైలు త్వరలోనే వస్తుందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వహయాంలో టీడ్కో గృహాలకు భూమి ఇచ్చినవారికి, నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీకి చెల్లింపులు చేయలేదని గుర్తుచేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక టిడ్కో ఇళ్లకు భూమి ఇచ్చిన రైతులకు రూ.3.50కోట్లు, ఎల్అండ్‌టీకి రూ.45కోట్లు చెల్లించి పనులు పూర్తిచేశామని వివరించారు. ఇలా నియోజకవర్గ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నట్లు చెప్పారు. పేటలో 24న నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రలో పార్టీ శ్రేణులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఉదయభాను కోరారు. అనంతరం యాత్ర వాల్ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ పేట మండల అధ్యక్షుడు మండవ శ్రీనివాసగౌడ్ అధ్యక్షత వహించగా, కేడీసీసీబీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్‌చైర్మన్ ఆర్.రాఘవేంద్ర, నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్, వైస్‌చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా ఫిరోజ్, ఎస్సీసెల్ నాయకుడు వేల్పుల రవికుమార్, ఏఎంసీ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత విజిత, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కుంచపు నారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, నియోజకవర్గ మైనార్టీసెల్ అధ్యక్షుడు రస్‌హుస్సేన్, పార్టీ మహిళ, ఎస్టీ, వాణిజ్య, కార్మిక విభాగాల అధ్యక్షులు మునిసి రాజ్యలక్ష్మి, బద్దూనాయక్, చారుగుండ్ల కొండ, గోగుల వెంకయ్య, పట్టణ, మండల సచివాలయాల కన్వీనర్లు తుమ్మేపల్లి నరేంద్ర, షాబుద్దీన్, సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

# 'జగనన్నకు చెబుదాం'తో సత్వర పరిష్కారం

**జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు**




మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, పక్కన జేసీ సంపత్‌కుమార్

**వత్సవాయి :** గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సత్వరం పరిష్కరించడమే 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. వత్సవాయిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాస్‌పుస్తకాల మంజూరు, అడంగల్‌లో పేర్ల సవరణ, సర్వేనంబర్లలో తప్పుల సవరణ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాప్రతినిధులు, ఆయాపార్టీల నాయకులు, ప్రజలు మొత్తం 135అర్జీలు అందజేశారు. రజకులు, కాపులు, హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి, మోడల్ కాలనీలో సీసీ రోడ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో మంచినీటి సదుపాయం, అమ్మిరెడ్డి చెరువును అభివృద్ధి కోరుతూ వత్సవాయి గ్రామ సర్పంచ్ భూక్యా సీతమ్మ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ సర్పంచ్ సీతమ్మను ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువతో సత్కరించారు. వత్సవాయి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, కరువు సాయాన్ని తక్షణమే అందించాలని సీపీఎం నాయకులు కోరారు. పోలంపల్లి డ్యామ్‌కు పడిన గండ్లను తక్షణమే పూడ్చి రైతులను ఆదుకోవాలని, లింగాల వద్ద మునేటిపై ఉన్న వంతెనకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ వారు అర్జీ అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన అర్జీలను ప్రాధాన్యతాక్రమంలో త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జేసీ పి.సంపత్‌కుమార్, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీపీవో జయచంద్రగాంధీ, డీవైఈవో వెంకటప్పయ్య, వ్యవసాయశాఖ డీఏవో నాగమణమ్మ, ఏడీఏ భవాని, తహశీల్దార్ వైకుంఠరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు రంగిశెట్టి ముత్తయ్య, అధికారులు పాల్గొన్నారు.

**జగనన్న కాలనీ సందర్శన..**

అనంతరం దబ్బాకుపల్లిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీని కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. పనులను వేగవంతంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తంచేశారు. లబ్ధిదారులు త్వరితగతిన గృహప్రవేశాలు చేసేలా చూడాలని సర్పంచ్ కొట్టే నగేష్‌కు సూచించారు.

# కంటి ఆపరేషన్లకు 85మంది తరలింపు

**వత్సవాయి :** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద, మధ్యతరగతి ప్రజల పాలిట వరం లాంటిదని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. ఇటీవల మండలంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో 85మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారిని శుక్రవారం ప్రత్యేక వాహనంలో గుంటూరుజిల్లా పెదకాకానిలోని శంకర్ నేత్రాలయకు తరలించగా, కలెక్టర్ జెండా ఊపి వాహనాన్ని ప్రారంభించారు. ఆపరేషన్లకు జిల్లాలో వత్సవాయి మండలం నుంచే అత్యధికమంది తరలివెళ్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఆపరేషన్లు అవసరమైన వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు, వసతులు ప్రభుత్వం సమకూర్చిందని చెప్పారు. ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు ఎంతో మేలు చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో జేసీ పి.సంపత్‌కుమార్, జిల్లా వైద్యాధికారి ఎం. సుహాసిని, సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, మండల వైద్యాధికారులు సుష్మాప్రియదర్శిని, ఎం.అర్షిదాబేగం, సీహెచ్‌వో ఎస్.మల్లికార్జునరావు, సూపర్‌వైజర్లు ఉషారాణి, జవహర్ పాల్గొన్నారు.




కంటి ఆపరేషన్లకు వెళ్తున్నవారితో కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు

**నందిగామ:** డివిజన్‌వ్యాప్తంగా నాగులచవితి పండుగను భక్తులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పుట్టల వద్దకు చేరుకుని పూజలు చేశారు. భక్తిశ్రద్ధలతో నాగేంద్రుడిని కొలిచి పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగులచవితి సందర్భంగా నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ఆయా ఆలయాల్లోనూ విశేష పూజలు చేశారు. పట్టణంలోని గాంధీనగర్, ముక్కపాటికాలనీలోగల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలు, డీవీఆర్ కాలనీ సమీపంలో గల నాగుల్‌మీరా పుట్ట, కృష్ణబలిజనగర్ పుట్ట, కంచెల సమీపంలోని పుట్ట, నాగమల్లి వృక్షాల సమీపంలోని పుట్టల వద్ద భక్తులు పొంగళ్లు సమర్పించి పూజలు చేశారు. కొందరు తమ చిన్నారులకు స్వామివారి సన్నిధిలో చెవులు కుట్టించి మొక్కులు చెల్లించుకున్నారు.

**వత్సవాయి మండలంలో..**

**వత్సవాయి :** మండల ప్రజలు నాగులచవితి వేడుకను శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. వత్సవాయి, పోలంపల్లి, కంభంపాడు, మక్కపేట, భీమవరం, చిట్టేల, మంగొల్లు గ్రామాల్లోని పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులకు పుట్టల వద్ద చెవులు కుట్టించారు. మక్కపేటలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రమణేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు.

**వీరులపాడు మండలంలో..**

**వీరులపాడు:** నాగులచవితి పండుగను పురస్కరించుకుని శుక్రవారం వీరులపాడు మండలంలోని ఆలయాలు, పుట్టల వద్ద ప్రజలు పూజలు చేశారు. జుజ్జూరులో వేంచేసియున్న సోమేశ్వర స్వామివారి ఆలయంలో అర్చకుడు యనమదల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఆవరణలోని జంట నాగులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు.

**జగ్గయపేటలో..**

**జగ్గయ్యపేట అర్బన్ :** నాగులచవితి వేడుకలను శుక్రవారం జగ్గయ్యపేట ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. విద్యానగర్ రైలుకట్ట వద్ద ఉన్న నాగలక్ష్మి అమ్మవారి ఆలయం, నాగమయ్య బజారులోని శ్రీభ్రమరాంబ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయం, తహశీల్దారు కార్యాలయ ఆవరణ, వెంకటగిరి గుట్ట వద్ద ఉన్న పుట్టబజారు, ఆర్టీసీ కాలనీ, సీతారామపురం కళ్యాణ మండపం, కోదాడ రోడ్డులోని ఎన్ఎస్‌పి కార్యాలయాల వద్ద ఉన్న పుట్టల వద్దకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి, పుట్టల్లో పాలుపోశారు. ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సతీమణి, విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను కుటుంబ సమేతంగా విద్యానగర్‌లోని నాగలక్ష్మి అమ్మవారిని సందర్శించి పుట్ట వద్ద పూజలు చేశారు.

**కంచికచర్ల మండలంలో..**

**కంచికచర్ల(వీరులపాడు):** నాగుల చవితి సందర్భంగా స్థానిక జుజ్జూరురోడ్డులోని శ్రీ నాగేంద్ర స్వామి పుట్ట వద్ద శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కులమతాలకతీతంగా నాగేంద్ర పుట్ట వద్దకు వచ్చి పుట్టలో పాలుపోసి, కోడిగుడ్లు వేసి ప్రత్యేక పూజలు చేశారు. పుట్ట వద్ద పసుపు, కుంకుమలు చల్లి స్వామివారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. మన రాష్ట్రంలోని పలుప్రాంతాల ప్రజలతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు 3వేల మందికి అన్నదానం చేశారు. కంచికచర్ల మండలంలోని మున్నలూరు కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీ సంగమేశ్వరస్వామి ఆలయం, గండేపల్లిలో నాగేంద్రస్వామి ఆలయం, కీసర, గొట్టుముక్కల, పరిటాల, మోగులూరు, చెవిటికల్లు గ్రామాల్లో నాగేంద్రస్వామి పుట్టల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు.



పేటలోని నాగలక్ష్మి అమ్మవారి ఆలయంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నందిగామలోని డీవీఆర్ కాలనీ పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



విద్యానగర్‌లో పుట్ట వద్ద పూజలు చేస్తున్న సామినేని విమలాభాను, భక్తులు



కంచికచర్ల నాగేంద్రస్వామి పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు



మక్కపేటలోని పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కంచికచర్లలో స్వామివారికి పసుపు, కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**నందిగామ:** సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ దిబ్బయ్య శుక్రవారం తెలిపారు. మరమ్మత్తులు నిర్వహించనున్నందున నందిగామ, అనాసాగరం, హనుమంతుపాలెం, మండలంలోని చందాపురం, అంబారుపేట, మునగచర్ల , ఐతవరం, కేతవీరునిపాడు, కంచల గ్రామాల పరిధిలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన

**నందిగామ:** బాల్యవివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మహిళా పోలీసులు, అంగన్‌వాడీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలను నిరోధించడం, మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. చైల్డ్ రైట్స్ అడ్వైసీ ఫౌండేషన్ ప్రతినిధి సిహెచ్ ప్రభాకరరావు, కృష్ణకుమారి పాల్గొన్నారు.

### చెరువులో యువకుడి మృతదేహం లభ్యం

**గౌరవరం(జగ్గయ్యపేట):** గౌరవరం చెరువులో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. చిల్లకల్లు ఎస్ఐ కృష్ణబాబు కథనం మేరకు గౌరవరంలో జాతీయ రహదారి పక్కనున్న చెరువులో మృతదేహం ఉందని గ్రామస్తులు సమాచారం అందించగా, పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి ప్యాంటు జేబులో ఉన్న ఫోన్ ఆధారంగా యువకుడు వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన చల్లా వంశీ (22)గా గుర్తించినట్లు ఎస్ఐ చెప్పారు. నందిగామలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడని పరీక్షల్లో ఫెయిల్ అవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు మృతుని కుటుంబసభ్యులు చెప్పారని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# గ్రంథాలయాల ఆధునికీకరణకు కృషి

**చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ**

**నందిగామ:** జిల్లాలోని గ్రంథాలయాల ఆధునికీకరణ, అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆమె నందిగామలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. అదనపు గదుల నిర్మాణాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో గ్రంథాలయాలను ఆధునికీకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రంథాలయాల్లో ఎంతో విలువైన, అరుదైన పుస్తకాలు ఉన్నాయని వాటిని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు గ్రంథాలయాల సేవలను వినియోగించుకొని మరింత పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. ఆమె వెంట పబ్లిక్ లైబ్రరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌ఎస్ దీక్షితులు , గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి నగేష్ ఉన్నారు.

**కంచికచర్ల మండలంలో..**

**కంచికచర్ల(వీరులపాడు):** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని జిల్లా గ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విజ్ఞానంతో కూడిన అన్నిరకాల పుస్తకాలు, విద్యార్థులకు అవసరమయ్యే పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. స్టేట్ పబ్లిక్ లైబ్రరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ దీక్షితులు మాట్లాడుతూ విద్యార్థులు మేధా సంపత్తిని పెంచుకునేందుకు గ్రంథాలయాలు దోహదపడుతున్నాయని వివరించారు. శాఖా గ్రంథాలయానికి జిరాక్స్ మెషిన్‌ను అందజేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి నగేష్, గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేలు, రంగిశెట్టి వెంకటేశ్వరరావు, సీఆర్పీలు ఎ.కనకరాజు, ఎం.కనకారావు, బీడీసీలు పాల్గొన్నారు.



నందిగామ గ్రంథాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పూర్ణమ్మ

### హెచ్ఐవీపై అవగాహన సదస్సు

**నందిగామ:** మండలంలోని మాగల్లులో సచివాలయం వద్ద రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ ఎలా సంక్రమిస్తుంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కమ్మినేని రవిశంకర్, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కేడీసీసీబీ సేవలపై ప్రత్యేక సమావేశం

**నందిగామ:** కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు బ్యాంక్ డైరెక్టర్ కె.రవిశంకర్ తెలిపారు. బ్యాంక్ 70వ అఖిలభారత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని కేడీసీసీ బ్యాంకు ఆవరణలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొమ్మినేని రవిశంకర్ మాట్లాడుతూ బ్యాంకు ద్వారా అన్నిరంగాల వారికి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. కార్పొరేట్ రంగానికి దీటుగా సేవలందిస్తూ అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. సహకార సంఘం ద్వారా సేవలను మరింత విస్తృతం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంక్ జిల్లా ఆడిట్ అధికారి త్రినాథ్, బ్యాంక్ అధికారులు దేవదాసు, శ్రీనివాసులు, స్వరూప, శ్రీనివాసరావు, రమేష్, శ్రీహర్ష, డివిజన్ పరిధిలోని సహకార సంఘాల అధ్యక్షులు, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. అనంతరం బ్యాంక్ సేవలను వివరిస్తూ నందిగామ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న కొమ్మినేని రవిశంకర్